క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల పరిశీలన



సుగాలిమెట్టలో పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎస్ఐ

పాణ్యం: సార్వత్రిక ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా తహసీల్దార్ ఫణికుమార్, ఎస్ఐ అశోక్ మండలంలోని పోలింగ్ కేంద్రాలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ప్రతి పోలింగ్ కేంద్రంలో తప్పనిసరిగా విద్యుత్, ర్యాంప్, మరుగుదొడ్లు, తాగునీరు ఉండాలన్నారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. ఓటర్లకు ఇబ్బంది కలగకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలన్నారు. రెవెన్యూ సిబ్బందికి పలు సూచనలు చేశారు.

కేసీ కాల్వకు నీటి విడుదల

గూడూరు: కర్నూలు ప్రజల తాగునీటి అవసరాల కోసం సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు శుక్రవారం 159 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు డ్యాం అధికారులు తెలిపారు. డ్యాంలో ప్రస్తుతం 0.338 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

డ్రోన్‌ల వినియోగంపై అవగాహన



ఎంఓయూ చేసుకుంటున్న ప్రతినిధులు

పాణ్యం: మండల పరిధిలోని శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాలలో వ్యవసాయ రంగంలో డ్రోన్‌ల వాడకంపై అవగాహన కల్పించినట్లు ప్రిన్సిపల్ సుబ్రమణ్యం శుక్రవారం తెలిపారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వ్యవసాయ రంగంలో యాంత్రీకరణ అవసరమన్నారు. అవగాహన సదస్సుకు ఇండియా డ్రోన్ అకాడమీ డైరెక్టర్ వంశీక్రిష్ణ హాజరై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ఎంఓయూ ఒప్పందం చేసుకున్నారు.


15 లోపు ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలి



మాట్లాడుతున్న ఏఓ శ్రీనివాసరెడ్డి

కల్లూరు: రైతులు రబీ సీజనల్‌లో సాగు చేసిన పంటల వివరాలను ఈనెల 15లోపు నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరెడ్డి సూచించారు. శుక్రవారం నిర్వహించిన మండల వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఏఓ మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం అందిస్తున్న సున్నా వడ్డీ, ఇన్‌పుట్ సబ్సిడీ, ఇతర రాయితీ పథకాలకు లబ్ధి పొందాలంటే పంట నమోదు తప్పనిసరి అన్నారు. రైతు భరోసా కేంద్రంలో వీఏఏ/వీహెచ్ఏలను కలసి పంట వివరాలను అందజేసి నమోదు చేయించుకోవాలన్నారు.


జగనన్న గోరుముద్దపై సమావేశం



మాట్లాడుతున్న ఎంఈఓ కోటయ్య

పాణ్యం: మండల కేంద్రంలోని ఎమ్మార్సీలో శుక్రవారం ఎంఈఓలు కోటయ్య, సుబ్రమణ్యం హెచ్ఎంలతో సమావేశమై గోరుముద్దపై చర్చించారు. ఎంఈఓలు మాట్లాడుతూ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందించాలన్నారు. ఇండెంట్, బిల్లులు సకాలంలో అప్‌లోడ్ చేయాలన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కల్లూరు: కల్లూరు ఎస్టేట్ పరిధిలోని శ్రీగోడల వీరహనుమంత రాయల ద్వితీయ వార్షిక ఆహ్వాన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఆలయ కమిటీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి, ఈశ్వర వీరభద్ర ఆలయ కమిటీ చైర్మన్, రైతులు పాల్గొన్నారు. శుక్రవారం అమావాస్యను పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు.

తడకనపల్లెలో 'పల్లెకు పోదాం'

కల్లూరు: మండల పరిధిలోని తడకనపల్లె గ్రామంలో శుక్రవారం బీజేపీ నాయకులు పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సోమేశ్వర ఆచారి, నాయకులు వీరప్ప, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

చెరువులకు జలకళ

- లిఫ్ట్ ఇరిగేషన్‌తో రెండు కార్లు సస్యశ్యామలం
- రెండు వేల ఎకరాలకు నీటిపారుదల
- ఫిబ్రవరి నెలలోనూ సాగునీటికి కొరత లేదు



ఆయకట్టు క్రింద సాగు పచ్చగా ఉన్న పంటలు

గడివేముల: లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా చెరువులను నీటితో నింపి ఆయకట్టుకు సాగునీరు అందిస్తుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నీటికి డోకా లేకపోవడంతో ఉత్సాహంగా రెండు కార్లు పంటలు పండించుకుంటున్నారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా రైతుల సంక్షేమానికి ఇంతగా కృషి చేయలేదని ఆయకట్టు రైతులు పేర్కొంటున్నారు. మంచాలకట్ట గ్రామంతో పాటు చుట్టుపక్కల ఉన్న ఎల్‌కే తండా, గని తదితర గ్రామాల జీవాలకు కూడా తాగునీరు అందిస్తున్నారు.

ఎమ్మెల్యే చొరవతో..

ఏపీ స్టేట్ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కింద 2014లో మంచాలకట్ట చెరువుకు ఎస్ఆర్‌బీసీ నుంచి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా ఎస్ఆర్‌బీసీ నుంచి చెరువులోకి నీటిని పంపింగ్ చేయడం ప్రారంభించారు. కొన్ని రోజులకే మోటార్లు కాలిపోయినా పట్టించుకోకపోవడంతో మరుగున పడింది. సమస్యను ఆయకట్టు రైతులు పాణ్యం ఎమ్మెల్యే కాట సాని రాంభూపాల్‌రెడ్డి తీసుకెళ్లగా ఆయన ప్రత్యేక చొరవతో అదనంగా మోటార్లు ఏర్పాటు చేయించారు. దీంతో ప్రస్తుతం రెండు సీజన్లకు సాగునీరు సమృద్ధిగా అందుతోంది. మంచాలకట్ట చెరువు కింద రెండువేల ఎకరాల ఆయకట్టు ఉండగా ఇందులో తలముడిపి గ్రామానికి 1,200 ఎకరాలు, మంచాలకట్టకు 800 ఎకరాలలో 454 మంది ఆయకట్టు రైతులు రెండు కార్ల పంటలు పండిస్తున్నారు.

ఫిబ్రవరిలోను చెరువులో నీళ్లు

ఫిబ్రవరి మాసంలోనూ మంచాలకట్ట చెరువు నీటితో కళకళలాడుతోంది. దీంతో రెండవ పంటకు సాగునీరు భయంలేదని, చెరువు కింద పంటలను సాగుచేసిన రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.ముఖ్యంగా మునగ, మినుము, మొక్కజొన్న, జొన్న పంటలను సాగుచేశారు. అన్నదాతల మోములో చిరునవ్వులు విరబూస్తున్నాయి. గని సోలార్ ప్రాజెక్టు వారితో మరో రెండు 200 హెచ్‌పీ మోటార్లను ఎమ్మెల్యే ఏర్పాటు చేయించారు. దీంతో చెరువు కింద ఉన్న పంటలకు రెండు సీజన్లకు సాగునీరు అందుతోంది.



నీటితో కళకళలాడుతున్న మంచాలకట్ట చెరువు



లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా చెరువులోకి నీటిని పంపింగ్ చేస్తున్న దృశ్యం

ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నాం



గత ప్రభుత్వంలో సమయానికి వర్షాలు పడక ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నాం. గతంలో మంచాలకట్ట చెరువు ఆయకట్టు కింద ఖరీఫ్ పంటకే కష్టంగా ఉండేది. ఎమ్మెల్యే కృషితో ఎత్తిపోతల లిఫ్ట్ ఇరిగేషన్ పథకంతో రెండవ పంటకు ఇబ్బంది లేదు. ప్రస్తుతం చెరువు నీటితో కళకళలాడుతుంది. రెండు సీజన్లకు సాగునీరు సమృద్ధిగా నీరందటంతో మంచి దిగుబడులు వస్తున్నాయి. చుట్టుపక్కల గ్రామాల పశువులకు తాగునీరు అందుతుంది.

– మేఘనాథరెడ్డి, మంచాలకట్ట

ఎమ్మెల్యేకు రుణపడి ఉంటాం



మంచాలకట్ట చెరువుకు గతంలో ఎన్నడూ లేని విధంగా లిఫ్ట్ ఇరిగేషన్‌ను ఏర్పాటు చేయించి, అదనంగా మరో రెండు మోటార్లు ఏర్పాటు చేసినందుకు ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డికి రుణపడి ఉంటాం. రెండు కార్లకు సాగునీరు సమృద్ధిగా అందించడంతో మా పొలాలు పంటలు బాగా పడుతున్నాయి.

– రామకృష్ణ, మంచాలకట్ట

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పాణ్యం: పాణ్యంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పొలిటికల్, తెలుగు సబ్జెక్టులకు గెస్ట్ ఫ్యాకల్టీ కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సింహాద్రి తెలిపారు. ఈనెల 12వ తేదీ కళాశాలలో జరిగే ఇంటర్వ్యూలకు అభ్యర్థులు సర్టిఫికెట్లతో హాజరుకావాలని చెప్పారు. గంటకు రూ.400 చొప్పున చెల్లించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 9441335805 నంబర్లలో సంప్రదించాలన్నారు.

గణాంక శాస్త్ర కోర్సులు చదివిన విద్యార్థులకు ఉద్యోగావకాశాలు

కర్నూలు(సెంట్రల్): గణాంక శాస్త్ర కోర్సులు చదివిన విద్యార్థులకు ప్రభుత్వం, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయని కర్నూలు జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి హిబ ప్రభాకరరాజు సూచించారు. శుక్రవారం సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాలలో జాతీయ గణాంక కార్యాలయ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు గణాంక శాస్త్ర అవగాహన కోసం క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఉత్తమ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ముఖ్య అతిథిగా హాజరైన సీపీఓ హిమ ప్రభాకరరాజు బహుమతులుఅందజేశారు. కార్యక్రమంలో జాతీయ ఉప గణాకం కార్యాలయాధికారి అమృత, ప్రిన్సిపాల్ శాంత, వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

సి.బెళగల్: మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలకు చెందిన 7వ తరగతి విద్యార్థి రాజు జాతీయ స్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ బలరాముడు తెలిపారు. శుక్రవారం పాఠశాలలో విద్యార్థి రాజు, పీడీ రాఘవేంద్ర, పీఈటీ ప్రభాకర్‌ను ఆయన అభినందించారు. ఈ నెల 2, 3, 4వ తేదీల్లో విశాఖపట్నం జిల్లా భీమిలిలో జరిగిన రాష్ట్ర స్థాయి రగ్బీ అండర్-14 పోటీల్లో కర్నూలు జట్టు తరఫున రాజు పాల్గొన్నాడని తెలిపారు. కర్నూలు గెలుపులో రాజు ప్రతిభ కనబరిచి ఏపీ రగ్బీ జట్టుకు ఎంపికయ్యాడని చెప్పారు. ఈ నెలలోనే గుజరాత్ రాష్ట్రంలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో రాజు పాల్గొంటాడని తెలిపారు.



రాజును అభినందిస్తున్న ప్రిన్సిపల్

గ్రామాల ప్రశాంతతకు కృషి

సి.బెళగల్: గ్రామాల్లో ప్రజలు ప్రశాంతంగా జీవించేలా చర్యలు తీసుకుంటామని సి.బెళగల్ ఎస్ఐ తిమ్మారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సోమశేఖర్ రెడ్డి, పార్టీ నాయకులు నూతన ఎస్ఐను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. గ్రామాలు ప్రశాంతంగా ఉండేందుకు ప్రజలు, నాయకులు కృషి చేయాలని, ఎక్కడైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. చట్టం పరిధిలోని అంశాలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని చెప్పారు. ఎస్ఐను కలిసిన వారిలో బ్రాహ్మణదొడ్డి, ఇనగండ్ల సర్పంచ్‌లు దస్తగిరి, ఇమ్మానియేల్, నాయకులు నరసింహుడు, మద్దిలేటి, వెంకటేష్, గోపాల్, మార్కెట్ యార్డు డైరెక్టర్ ఎస్ఎం బాషా, ముళ్ల హారున్, గోవిందరెడ్డి ఉన్నారు.



ఎస్ఐను అభినందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆరోగ్య సురక్ష.. పేదలకు రక్ష


- డీఎంఅండ్‌హెచ్ఓ రామగిడ్డయ్య



హెల్త్ క్యాంపులో మెడికల్ కిట్లు అందిస్తున్న రామగిడ్డయ్య

కోడుమూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తుందని డీఎంఅండ్‌హెచ్ఓ రామగిడ్డయ్య అన్నారు. శుక్రవారం అనుగొండలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపును ఆయన తనిఖీ చేశారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవల పై ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఇంటిని, కుటుంబాన్ని ఆరోగ్యంగా ఉంచాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. ప్రజలంతా హెల్త్ క్యాంపులో పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఏవైనా అనారోగ్య సమస్యలుంటే వారికి ఆరోగ్యశ్రీ కింద కార్పొరేట్ హాస్పిటల్స్‌లో వైద్య చికిత్సలందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీని పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్లు కావ్య, జగదీష్, భాస్కర్, సీహెచ్ఓ శాంత, హెల్త్ ఎడ్యుకేటర్‌లు శ్రీనివాస్‌యాదవ్, శారద పాల్గొన్నారు.

విద్యార్థులలో నైపుణ్యాలను పెంపొందించాలి



విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షిస్తున్న ఎంఈఓ జ్యోతి

సి.బెళగల్: ఉపాధ్యాయులు విద్యార్థుల్లో విద్యా నైపుణ్యాలను పెంపొందించి, వారి విద్యాభివృద్ధికి కృషి చేయాలని ఎంఈఓ జ్యోతి అన్నారు. శుక్రవారం చింతమానుపల్లె, తిమ్మందొడ్డి, సంగాల, గుండ్రేవుల, ఇనగండ్ల ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు. విద్యార్థులతో పాఠ్యాంశాలను చదివించి వారి సామర్థ్యాలను పరీక్షించారు. పాఠశాల పరిసరాలను, రికార్డులను తనిఖీ చేసి ఉపాధ్యాయులకు పాఠశాల నిర్వహణ, విద్యా బోధనపై సూచనలు చేశారు. సంగాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డించారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఆయా పాఠశాలలలో మనబడి నాడు-నేడు రెండో విడత అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని హెచ్ఎంలను ఆదేశించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గూడూరు: విద్యుత్ ఫీడర్ల మరమ్మతు పనుల కారణంగా గూడూరు సబ్‌డివిజన్ పరిధిలోని కోడుమూరు, గూడూరు, సి.బెళగల్ మండలాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని డిప్యూటీ ఈఈ జేషన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు, వ్యాపారులు, గృహ వినియోగదారులు గమనించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

గోపూజ చేస్తే సకల శుభాలు



గోమాతకు పూజ చేస్తున్న మహిళలు

గడివేముల: ముక్కోటి దేవతలకు నిలయమైన గోవులను పూజించడం ద్వారా సకల శుభాలు కలుగుతాయని టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో గడివేములలోని రామాలయంలో నాలుగు రోజులుగా జరుగుతున్న ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు శుక్రవారంతో ముగిశాయి. గోవును ప్రత్యేకంగా అలంకరించి భక్తులు పూజలు నిర్వహించారు. అనంతరం రామాలయంలో అమ్మవారికి కుంకుమార్చన జరిపించారు. కార్యక్రమంలో ధర్మ ప్రచారకులు చెంచు రామ్మోహన్‌రావు, ఎంపీటీసీ మహేశ్వర రెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం

కల్లూరు: మండల సర్వసభ్య సమావేశం శనివారం ఎంపీపీ శారద అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రమణమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్పంచులు ఎంపీటీసీలు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు హాజరుకావాలన్నారు.

నాల్గవ విడత పంపిణీ

పాణ్యం: మండల కేంద్రంలోని బొమ్మల ఆలయం వద్ద శనివారం వైఎస్సార్ ఆసరా నిధులను విడుదల చేయనున్నట్లు ఏపీఎం ప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి హాజరవుతారన్నారు.

కార్పొరేటర్‌పై కేసు నమోదు

కర్నూలు (న్యూటౌన్): 30వ వార్డు కార్పొరేటర్ జయరామ్, అతని సోదరులు కరుణాకర్, అభి, మరో ఇద్దరిపై కర్నూలు నాల్గవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పాతకక్షల నేపథ్యంలో గురువారం రాత్రి నిందితులు తనపై కత్తితో దాడి చేసి గాయపరిచినట్లు బాధితుడు షరీన్‌నగర్‌కు చెందిన ప్రభాస్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలి

గడివేముల: బడి ఈడు పిల్లలు బడిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎంఈఓ-2 విమలా వసుంధరదేవి సూచించారు. శుక్రవారం స్థానిక ఎంఈఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెచ్ఎంల సమావేశంలో ఆమె మాట్లాడారు. బడి ఈడు పిల్లలు పాఠశాలకు హాజరయ్యేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ విషయంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు, విద్యా సహాయకులు, వలంటీర్లు కృషి చేయాలన్నారు.

ఎన్నికల నిర్వహణలో బాధ్యతగా వ్యవహరించాలి

సి.బెళగల్: ఎన్నికల నిర్వహణలో అధికారులు, బీఎల్వోలు బాధ్యతగా వ్యవహరించాలని కర్నూలు ఆర్డీఓ శేషిరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ అనుపమ, ఎంపీడీఓ శకుంతలతో కలిసి మండల ఎన్నికల సెక్టోరియల్ అధికారులు, సూపర్‌వైజర్లు, బీఎల్వోలతో సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితా నిర్వహణపై అవగాహన కల్పించారు. బీఎల్వోలు ఎన్నికల విధులను ప్రధాన బాధ్యతగా భావించి అర్హులైన వారిని ఓటర్లుగా చేర్చాలన్నారు. ఓటర్ల జాబితాలో ఎలాంటి పొరపాట్లు లేకుండా బీఎల్వోలు, బూత్‌లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏ)లు శ్రద్ధ వహించాలని ఆదేశించారు. అదేవిధంగా ఎన్నికల సెక్టోరియల్ అధికారులు, సూపర్‌వైజర్లు పోలింగ్ స్టేషన్లు, రూట్లపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, పోలింగ్ స్టేషన్లలో వసతులు, సౌకర్యాలపై నివేదికలను అందజేయాలని అన్నారు. నియోజకవర్గ ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. బీఎల్వోలు ఇంటింటికి తిరిగి ఓటరు జాబితాల్లో ఎలాంటి తప్పులు లేకుండా సిద్ధం చేయాలని సూచించారు. అనంతరం మాక్ పోలింగ్ నిర్వహణపై ప్రవీణ్‌కుమార్ అధికారులకు అవగాహన కల్పించారు. సమావేశంలో మండల డిప్యూటీ తహసీల్దార్ కృష్ణమూర్తి, సెక్టోరియల్ అధికారులు సూర్యప్రకాష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనేనాయక్, ఎంఈఓ-2 ఆదామ్‌బాషా, ఏఎస్ఐ నాగయ్య పాల్గొన్నారు.



అధికారులకు సూచనలు చేస్తున్న ఆర్డీఓ శేషిరెడ్డి

భక్తిశ్రద్ధలతో అమావాస్య పూజలు

ఓర్వకల్లు: మండలంలోని వేర్వేరు ప్రాంతాలలో వెలసిన ఆంజనేయస్వామి దేవస్థానాల వద్ద శుక్రవారం అమావాస్య పూజలను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భైరాపురం వీరాంజనేయ స్వామిని దర్శించుకొని భక్తులు కొబ్బరికాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కొమ్ముచెరువు, కాల్వ గ్రామాల ఆంజనేయస్వామిని కుడా చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి, వెంకాయపల్లె ఎల్లమ్మ ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ మహేశ్వర రెడ్డి, గుడుంబాయి తండా వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసులునాయక్, ఆలయ నిర్వాహకులు రమేష్ శెట్టి బృందం స్వాముల వారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. ఆయా ఆలయాల వద్ద స్వాములవారికి సింధూర పూజ, ఆకుపూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.



కోనేటి ఆంజనేయస్వామి సన్నిధిలో హర్షవర్ధన్‌రెడ్డి

కంటి పరీక్షలు చేయించుకోవాలి

కర్నూలు: డ్రైవర్లు తరచూ కంటి వైద్యపరీక్షలు చేయించుకోవాలని జేసీ నారపురెడ్డి మౌర్య సూచించారు. రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా డీటీసీ శ్రీధర్ ఆధ్వర్యంలో శుక్రవారం డ్రైవర్లకు జిల్లా గ్రంథాలయ సంస్థలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. శాంతిరామ్, మెడికవర్ హాస్పిటల్‌కు చెందిన వైద్యులు పాల్గొని బీపీ, షుగర్, ఈసీజీ, గుండెకు సంబంధించిన పరీక్షలను నిర్వహించారు. శాంతిరామ్ హాస్పిటల్ డాక్టర్లు కళ్ల పరీక్షలు నిర్వహించారు.

నులిపురుగుల నివారణతో పిల్లల్లో ఆరోగ్యం



కోడుమూరు హైస్కూల్లో ఆల్బెండజోల్ మాత్రలను వేస్తున్న ఎంపీడీఓ

కోడుమూరు రూరల్: రక్తహీనతకు ప్రధాన కారణమైన నులిపురుగుల నివారణతో పిల్లల్లో చక్కటి ఆరోగ్యం కలుగుతుందని ఎంపీడీఓ దివ్య తెలిపారు. నులి పురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలో 19 ఏళ్లలోపు పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. కోడుమూరు బాలుర హైస్కూల్లో నిర్వహిస్తున్న కార్యక్రమంలో ఎంపీడీఓ దివ్య పాల్గొని పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలను వేశారు.

9614 మంది పిల్లలకు..

వైద్యాధికారి శ్రీమంత్ మాదన్న మాట్లాడుతూ.. కోడుమూరులోని అంగన్‌వాడీ సెంటర్లు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కాలేజీల్లో మొత్తం 10,120 మంది పిల్లలుండగా, 9614 మందికి అల్బెండ్‌జోల్ మాత్రలను మింగించామన్నారు. గైర్హాజరైన పిల్లలకు ఈనెల 16వ తేదీ మాత్రలను వేస్తామని తెలిపారు. ఎంఈఓ వసంతలక్ష్మి, ఈఓఆర్డీ మంజుల, వైద్యుడు మదన్‌శేఖర్, హెచ్ఎం తైమూర్‌బాషా పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ

గూడూరు: పట్టణంలో 5073 మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించినట్లు వైద్యాధికారి ప్రత్యూష తెలిపారు. జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో హెచ్ఎం సురేష్‌తో కలిసి విద్యార్థులకు మాత్రలు మింగించారు.

పాణ్యంలో 10 వేల మందికి..

పాణ్యం: మండలంలో సుమారు 10 వేల మంది విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేసినట్లు ఎంఈఓలు కోటయ్య, సుబ్రమణ్యం తెలిపారు. నులిపురుగుల వల్ల పిల్లల్లో రక్తహీతన ఏర్పడుతుందని తెలిపారు. వీటి నిర్మూలనకు ఈ మాత్రలు వేసినట్లు చెప్పారు.

ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ

ఓర్వకల్లు: మండలంలో 19 ఏళ్లలోపు పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. నన్నూరు జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలలో జరిగిన మాత్రల పంపిణీని ఎంపీడీఓ మల్లీశ్వరి తనిఖీ చేశారు. విద్యార్థుల పాటించాల్సిన ఆహారపు అలవాట్లు, శారీరక పరిశుభ్రతను వివరించారు.



గూడూరులో..



పాణ్యంలో..



నన్నూరులో..

నేడు విద్యుత్ కోత

కర్నూలు(అగ్రికల్చర్): నగరంలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు కర్నూలు టౌన్ డివిజన్ విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ చక్రపాణి తెలిపారు. విద్యుత్ సబ్ స్టేషన్‌లు, విద్యుత్ లైన్‌ల మెయిన్‌టెనెన్స్‌లో భాగంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్యాంపస్ సెక్షన్ పరిధిలోని మద్దూరునగర్, సీ.క్యాంపు, గణేషనగర్, రెవెన్యూ కాలనీ, 4వ తరగతి ఉద్యోగుల కాలనీ, సాయివైభవ్ నగర్, చెక్‌పోస్టు ఏరియా, శేషాద్రి నగర్, బృందావన్ నగర్, మారుతినగర్, అరుంధతి నగర్ పరిసరాలు, శ్రీరామ్‌నగర్, మారుతి మెగాసిటీ, పోస్టల్ కాలనీ, ధనలక్ష్మీనగర్, కమలానగర్, టెలికామ్ నగర్, గఫార్ నగర్, పరాశక్తినగర్, ఫుడ్ కార్పొరేషన్ ఏరియా, కిసాన్ నగర్, శ్రీనగర్‌కాలని, లెక్చరర్స్ కాలనీ, మాధవనగర్, సీ అండ్ బి. క్యాంపు, గాయత్రీ ఎస్టేటు, లక్ష్మీనగర్, ఓల్డ్‌టౌన్ సెక్షన్ పరిధిలోని వన్ టౌన్ ఏరియా, జొహరాపురం హౌసింగ్ బోర్డు, ఇందిరమ్మ బిల్డింగ్స్, జమ్మిచెట్టు ఏరియా, ఎస్టేటు సెక్షన్ పరిధిలోని అబ్బాస్ నగర్, క్రిష్ణానగర్, రామకృష్ణనగర్, గుత్తిపెట్రోలు బంకు ఏరియా, శరీన్‌నగర్, కల్లూరు, టోటల్ కల్లూరు ఏస్టేటు ఏరియాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. ఇందుకు వినియోగదారులు విద్యుత్ అధికారులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కోడుమూరు, పాణ్యం
70750 09147 (కోడుమూరు),
70750 09185 (పాణ్యం)
Office mail : sakshiknladvt@gmail.com